## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్‌ను నమ్మేదే లేదు

- మూడు గంటల కరెంటుతో ముప్పు తిప్పలే
- చేతికి ఓటేస్తే రైతన్నకు నిద్రలు కరువే
- గతంలో అనుభవించిన కష్టాలు తలుచుకుంటున్న అన్నదాతలు

*గత పదేళ్లుగా ఎవుసం రందీ లేకుండా సాగుతున్నది. 24 గంటల కరెంటు, సాగుకు సరిపడా నీళ్లు, అందుబాటులో ఎరువులు, విత్తనాలు, పంట పెట్టుబడికి రైతు బంధు, కల్లాల్లోనే ధాన్యం కొనుగోళ్లు వంటి వాటితో రైతులు భరోసాగా బతుకుతున్నారు. అయితే, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను ముంచే కుట్రలకు తెరలేపుతున్నారు. మూడు గంటల కరెంటు సరిపోతుందని, 10 హెచ్‌పీ మోటర్లు వాడితే పొలం పారుతుందని చెబుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు గంటలతో మూల కూడా పారదని, 10 హెచ్‌పీ మోటర్లు ఏ రైతైనా వాడుతారా? అంటూ నిలదీస్తున్నారు. వ్యవసాయం విషయంలో కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబడుతున్నారు. ఆ పార్టీని నమ్మితే తమకు నిద్రలు కరువవుతాయని గతంలో అనుభవించిన కష్టాలను గుర్తు చేసుకుని ఆందోళన చెందుతున్నారు. ఎట్టి పరిస్థితిలో కాంగ్రెస్‌ను నమ్మేదే లేదని, రైతులకు అండగా నిలుస్తున్న బీఆర్‌ఎస్‌కే మద్దతిస్తామని స్పష్టం చేస్తున్నారు.*

### మంచేదో చెడోదో మాకు తెల్సు



ఎవుసానికి మూడుగంటల కరెంటుపై సన్నాయినొక్కులు నొక్కుతున్న రేవంత్‌కు ఎలచ్చన్లల్లో బుద్ధి చెప్పుడే. తెలంగాణ రాకమునుపు రాత్రిపూట భయభయంగా బాయికాడికి పోయి మోటారు పెట్టిన రోజులు కండ్ల ముందు మెదులుతున్నయ్. గటువంటి రోజులు మళ్లా తెస్తామంటున్న రేవంత్‌కు ఎలచ్చన్లో రైతులు చుక్కలు చూపించాలే. కేసీఆర్ సారు అచ్చినంకనే రైతుల బాధలు తీరినయ్. రాత్రిపూట బాయికాడికి పోవడం తప్పడంతో కంటినిండా నిద్రపోతున్నం. మంచేదో చెడోదో మాకు తెల్సు. ఉత్తమాటలు చెప్పుడు కాదు. తెలంగాణ రాకమునుపు కాంగ్రెసోళ్లు కరంటు ఎందుకియ్యలే?. కేసీఆర్ సారుకు ఎట్లా సాధ్యమైంది. ఈసారి కూడా మమ్మల్ని(రైతులను) పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్న కేసీఆర్‌కే మా మద్దతు.

**-గుండా నారాయణరెడ్డి, రైతు, ఇప్పల్‌నర్సింగాపూర్ (హుజూరాబాద్)**

### అప్పటి కష్టాలు గుర్తొస్తే కన్నీళ్లాగవు



పదేండ్ల కిందట కరెంట్ కష్టాలు గుర్తొస్తే కన్నీళ్లు ఆగడం లేదు. రాత్రి పూట పొలం వద్దకు పోయి పడుకుంటే ఎప్పుడూ ఏమవుతుందో అనే భయం ఉంటుండే. కాంగ్రెస్ కాలంలో రాత్రివేళ కరెంట్ కూడా సరిగా ఉండకపోయేది. ఒకవేళ వచ్చినా ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. దీంతో తడిసిన వద్దే పొలం తడిసేది. నిద్రాహారాలు మానుకొని పొలం వద్దే కావలి కాసేటోళ్లం. అప్పటి కాలాన్ని తలుచుకుంటే చాలా భయమేస్తుంది. పొలం వద్ద పడుకున్నప్పుడు పాములు, తేళ్లు ఎక్కడ కాటేస్తాయోనని భయం భయంగా ఉండేది. రాత్రి పూట మోటర్లు పెట్టేటప్పుడు అక్కడక్కడ తేలిన వైర్లు తగిలి ప్రాణాలు పోయేటియి. ఈ చావులను చూస్తే వ్యవసాయం చేయడమే మానుకోవాలనిపించేది. ఇప్పుడు బీఆర్‌ఎస్ సర్కారు పాలనలో 24 గంటల కరెంట్ ఉంటున్నది. ఎప్పుడు కావలిస్తే అప్పుడు వెళ్లి పంటలకు నీళ్లు పారించుకుంటున్నం. హాయిగా నిద్రపోతున్నం. ఎకరానికి గంట సమయం కరెంట్ ఉంటే చాలని మాట్లాడడం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వానికి, అవగాహన రాహిత్యానికి నిదర్శనం. మా రైతుల ఐక్యత ఏందో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చూపెడుతం. మళ్లీ రైతు బాంధవుడైన కేసీఆర్ సారును, బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటం. **- మూగల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, పెద్దపాపయ్యపల్లి, (హుజూరాబాద్‌టౌన్)**

### కాంగ్రెసోళ్లకు సోయిలేదు



20 ఏండ్ల కింద పంటలు పండించడానికి నీళ్లు లేవు. 10 బోర్లు వేసినా చుక్కా నీరు పడలేదు. పైసలు ఖర్చు అయినయి తప్పితే పంటలకు నీళ్లు అందలేదు. కరంటు సక్కగ రాక, నీళ్లు లేక ఎవుసం దండుగ అనుకున్నం. రాత్రి టైంలో కరెంటు కాడికి పోయి పొలానికి నీళ్లు పెట్టినం. కరెంటు సక్కగ ఉండక జాగారం చేసినం. తెలంగాణ సర్కారు వచ్చినంకనే రైతులం బాగుపడ్డం. ఇప్పుడు పొద్దంత కరంటు ఉంటున్నది. ఎప్పుడంటే అప్పుడు కరంటు కాడికి పొయ్యి నీళ్లు పెడుతున్న. ఎవుసం మీద అవగాహన లేని వాళ్లే 10 హెచ్‌పీ మోటర్ పెట్టాలి అంటరు. 10 హెచ్‌పీ మోటర్ పెడితో బాయిల నీళ్లు ఉండయి. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయి. కాంగ్రెసోళ్లకు గాయింత సోయిలేదు. వాళ్లకు అధికారం ఇస్తే రైతులను ఆగం చేస్తరు. వాళ్ల మాటలను రైతులు నమ్మరు. కేసీఆర్ సారు ఉంటేనే మంచిగ ఉంటది.

**-సాగి సత్యనారాయణరావు, బూరుగుపల్లి (గంగాధర)**

### రాత్రి పూట అరిగోస పడ్డం



నాడు కాంగ్రెస్ హయాంలో రాత్రి పూట కరంటు వచ్చినప్పుడు అరిగోస పడ్డాం. ఇంటికాడ బుక్కడు బువ్వ తిందామంటే పెయ్యి కెక్కడిది కాదు. బుగ్గ ఎలిగితే పొలాల కాడనే ఉండేవాళ్లం. గడ్డల మీద పండుకొని కరంటు వస్తే స్టాటర్ ఆన్ చేసుకునే వాళ్లం. తెల్లరేదాక తెలివి తోటే ఉండే వాళ్లం. అయినకూడా కింది మడి ఎండిపోయేది. గుడ్డెల్గులు, అడవి పందుల భయంతో నరకం అనుభవించినం. అటువంటి రోజులు రావద్దని కోరుకుంటున్నం. కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఎన్ని మాయమాటలు చెప్పినా నమ్మం. పొద్దంతా పొలాల కాడ పని చేసుకొని రాత్రి పూట ఇంటి వద్దనే ఉంటున్నం. మూడు గంటల కరంటు దేనికి సరిపోతది. కాలువ కూడా సాగదు. రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి ఏం తెల్వదు. తెలిస్తే ఇలాంటి మాటాలు మాట్లాడడు.

**-కన్నబోయిన జంపయ్య, వెంకట్రావుపల్లి, రైతు (హుజూరాబాద్ రూరల్)**

### ఆగం చేసేందుకే ఈ కుట్రలు



కాంగ్రెస్ నాయకులు వ్యవసాయంపై అర్థంపర్థం లేకుండా మాట్లాడుతున్నరు. వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ సరిపోతుంది అనడం వారి అవివేకం. పొలాల వద్ద 3 హెచ్‌పీ, 5 హెచ్‌పీ మోటర్లనే వాడుతరు. 10 హెచ్‌పీ మోటర్‌తో రైతుకు ఖర్చు ఎక్కువ అవ్వడమే కాకుండా బోర్లు ఎండిపోవుడు ఖాయం. ఈ మోటర్లను బిగించి రైతులందరూ ఒకేసారి బోర్లు ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయి. కాంగ్రెస్ పాలనలో వ్యవసాయం పాడైపోయింది. కరెంట్ ఎప్పుడు వచ్చేదో, ఎప్పుడు పోయేదో తెలువకపోతుండే. కాంగ్రెస్ హయాంలో రాత్రిపూట వదిలే కరెంట్‌తో అనేక ఇబ్బందులు పడ్డం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తున్న 24 గంటల కరెంట్‌తో ఆనందంగా వ్యవసాయం చేసుకుంటున్నం. ఉదయం పొలం వద్దకి వచ్చి బోరు మోటర్ ఆన్ చేసి, సాయంత్రం ఇంటికి వెళ్లేటప్పుడు బంద్ చేసి వెళ్తున్నం. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ అందిస్తున్న సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

**- బొంగోని రవి, రైతు, పెద్దంపల్లి, జమ్మికుంట మండలం(హుజూరాబాద్‌టౌన్)**

### ఆవుల పచ్చి గడ్డి మడి పారది..



కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మూడు గంటల కరెంటు ఇస్తం. అది మస్తు సరిపోతది అని రేవంత్‌రెడ్డి అన్నడు. అప్పుడు పొద్దు, మాపు ఏడు గంటలు ఇత్తెనే ఎవనెవుసం సక్కగ పారలే. ఇప్పుడు నీ మూడు గంటలు ఎవనికి కావలే.? ఆ మూడు గంటలతోని మా ఆవులకు మేతకు పెంచే పచ్చి గడ్డి మడి పారది. ఇంక ఎవుసానికి ఎప్పుడు పెట్టుమంటవు. మీరేం మాట్లాడుతర్రో.. మీకే అర్థమైతలేదు. కర్ణాటకకేలి అచ్చి ఐదు గంటలు సరిపోతది అని ఒగాయనె అంటండు. ఇప్పుడిప్పుడే మేం మంచిగ ఎవుసం చేసుకుంటన్నం. మల్ల మీరచ్చి పుల్లలు పెట్టి ఇబ్బందుల పాలు చేసేటట్టే ఉన్నరు. రైతులను ఇబ్బందులు పెట్టేటట్టే ఉన్నరు. నీ మూడు గంటలు కరెంటుతోని కర్ణాటకోళ్లు మస్తు ఇబ్బందులు పడుతున్నరు. ఇప్పుడు మీరత్తే మేం ఇబ్బంది పడాల్నా.? మేం ఇప్పుడు మంచిగనే ఉన్నం.

**-సిరికొండ సంపత్‌రావు, రైతు,(తిమ్మాపూర్)**

### కాంగ్రెసోళ్ల మాటలు నమ్మం



సమైక్యపాలనలో కరెంట్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడ్డాం. నారు పోసిన నాటి నుంచి పంట కోసే వరకు అరిగోస పడ్డాం. కరెంట్ సక్కగా రాక కొంత భూమి పడావు పెట్టినం. కేసీఆర్ సారు అచ్చినంక మాకు కరెంట్ కష్టాలు తప్పినయి. ఇప్పుడు 24 గంటలు కరెంట్ ఇస్తుండడంతో పంటలు పుష్కలంగా పండుతున్నయి. అసలు ఇట్లాంటి రోజులు వస్తాయని ఎప్పుడు అనుకోలేదు. కేసీఆర్ అసోంటి నాయకులను ఇప్పటి వరకు చూడలేదు. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని చెబుతున్నరు. వారి మాటలు వింటే మళ్లీ భయమేస్తోంది. ఎందుకుంటే పాత రోజులు తీసుకువచ్చేలా ఉన్నరు. రైతుల పాలిటదేవుడు కేసీఆర్ సారు. ఈసారి ఆయనకే ఓటు వేస్తం.

**- పోశయ్య, ఐనవారిపల్లె (కొత్తపల్లి)**

### కాంగ్రెసోళ్లను రానిస్తే బతుకు బజారే..



పంట పండించడానికి పడే కష్టాలు ఖరీదైన కార్లల్లో తిరిగే వాళ్లకు ఏమి తెలుస్తది. 24 గంటలు ఉచితంగా కరెంటు ఇస్తుండడంతో రాజా లాగా ఎవుసం చేసుకుంటున్నం. ఉన్న ఎకరంన్నరలో ఉన్నతంగా బతుకు వెళ్లదీస్తున్నాం. మిగిలిన ఖాళీ సమయంలో ఊళ్లో కరెంటు పని చేసుకుంటున్న, ఇప్పుడు మూడు గంటల కరెంటు ఇస్తే ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతాదో తెలియదు. మా రైతు కష్టాలు గత ప్రభుతాల లెక్క మళ్లీ వస్తయి. ఎవుసం గురించి తెలియని వాళ్లు ఎందుకు మాట్లాడుతున్నారో రైతులు గమనిస్తున్నారు. స్వరాష్ట్రంలో సంతోషంగా ఉన్నరు. మూడు గంటల కరెంటు మాటలతో రైతులు భయపడుతున్నరు. వీళ్లను రాణిస్తే రైతుల బతుకులు బజారున పడుతయి. కాంగ్రెసోళ్ల మాయ మాటలను నమ్మే పరిస్థితుల్లో రైతులు లేరు. 24 గంటల కరెంటు ఇచ్చే వారిని కాదని మూడు గంటల కరెంటు ఇచ్చేటోళ్లు అవసరంలేదు.

**-పోతరవేణి తిరుపతి, రైతు, పోచమ్మవాడ (కరీంనగర్)**

### 20 ఏండ్లు వెనక్కి పోతం



కాంగ్రెసోళ్లకు ఓటు వేస్తే 20 ఏండ్లు వెనక్కి పోతం. 20 ఏండ్ల కింద కాంగ్రెస్ గవర్నమెంట్ రాత్రి పూటనే ఎవుసానికి కరెంటు ఇచ్చింది. అర్ధరాత్రి పొలం కాడికి పొయ్యి నీళ్లు పెట్టెటోళ్లం. ఎప్పుడు కరంటు ఉంటదో, ఎప్పుడు పోతదో తెలవక రాత్రంతా జాగారం చేసేటోళ్లం. రాత్రంతా కూసుండి కరంటు పెడితె ఒక్కమడి పారేది కాదు. తెలంగాణ గవర్నమెంట్ అచ్చినంగా తిప్పలు తప్పినయి. రాత్రి పూట బాయి కాడికి పోవుడు బంద్వైంది. కాంగ్రెసోళ్లు, బీజేపోళ్లు ఉత్త ముచ్చట్లు చెప్పుడే ఉంటది, చేసుడు ఉండది. కేసీఆర్ చెప్పిందే చేస్తడు. మళ్ల కేసీఆర్ అత్తెనే మంచిగుంటది.

**-గడ్డం హన్మయ్య, బూరుగుపల్లి (గంగాధర)**

### 10 హెచ్‌పీ మోటరు భారంకాదా?



తెలంగాణ రాకు ముందు కరెంటుకోసం చాలా ఇబ్బంది ఉండేది. కరెంట్ కోసం గంటల తరబడి ఎదురుచూసేవాళ్లం. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మాకు కరెంట్ కష్టాలు తొలగినయ్. నిరంతరం కరెంట్ ఇస్తుండడంతో వ్యవసాయం కొంత ఈజీ అయింది. కాంగ్రెసోళ్లు మళ్లీ మూడు గంటల కరెంటు అనుడేంది. అది వ్యవసాయానికి సరిపోతదా. రేవంత్ రెడ్డి వ్యవసాయం చేస్తే తెలుస్తుంది ఎన్ని గంటలు కరెంటు కావాల్నో. హైదరాబాద్‌లో ఉండి వ్యవసాయం గురించి మాట్లాడితే ఎట్ల. ఊర్లళ్లకు వస్తే తెలుస్తుంది. 10 హెచ్‌పీ మోటర్లతో వ్యవసాయం రైతులకు భారంకాదా? కరెంటు మోటార్‌కాలిపోతే రైతులను ఎవరు ఆదుకుంటరు. ఇప్పుడున్న మోటర్ల వల్ల ట్రాన్స్‌ఫార్మర్లకు కూడా ఇబ్బంది లేదు.

**- ఏశిక ఐలయ్య, రైతు, ఆరెపల్లి (సైదాపూర్)**